

జీవితంలో ఎన్నో సంఘటనలు ఎదురవుతాయి. ఎదురయినవన్నీ మనసుపై చెరగని ముద్రలు వేయలేకపోవచ్చు. ఒక్కోసారి కాకతాళీయంగా జరిగినవే తీవ్రమనస్థాపానికి గురిచేస్తుంటాయి. ఆ సంఘటన జరిగి పుష్కరంన్నర పైనే అయింది. అయినా ఇంకా అది నా గుండెల్లో ములుకులా గుచ్చుకొంటూనే వుంది. మనోభారాన్ని పెంచుతూనే ఉంది. ఒక అనాలోచిత చర్య... త్వరగా నిర్ణయం తీసుకోలేకపోయినందుకు కలిగిన ఫలితం... అది పాపమో, మరేమో... నేనైతే నిర్ణయించుకోలేక పోతున్నాను. అందుకు పరిహారంగా ఏదో చేస్తున్నా... అసలు వ్యక్తికి కలిగిన నష్టాన్ని ఎలా పూరించగలం? అందుకే ఆ సంఘటననీ... ఆ వ్యక్తినీ మరచిపోలేక పోతున్నానేమో! అలా మరచిన నాడు నాలో మానవత్వం లోపించినట్లవుతుంది.

ఆ రోజు... ఇంకా తెల్లవారలేదు. మంచు తెరల దుప్పటిని తొలగించుకుంటూ తొలికిరణాలను ప్రసరింపచేసే ప్రయత్నం చేసుకుంటున్నట్టున్నాడు భాస్కరుడు. తూరుపు ఆకాశంలో ఎర్రదనం అలుముకుంటోంది. అయిదు గంటలకే రైలు కావడంతో ఎంత త్వరగా లేచినా తెమిలేసరికి ఆలస్యం అవ్వనే అయింది. స్టేషనుకు నడచిపోగల దూరమే. గబగబా ఇంట్లోంచి బయటపడి స్టేషను వైపు నడక సాగించాం నేనూ, నా మిత్రుడు కృష్ణమూర్తిగారూ. అప్పటికే రైలు రావలసిన సమయం అయిపోయింది. ఏ మాత్రమో ఆలస్యం కాదా అన్నధీమాతో నడక ప్రయత్నం చేసాము. ఆ సమయానికి వీధిలో రిక్షాలు కనబడకపోవడం కూడా ఒక కారణం. బండి వచ్చేస్తుందేమోనన్న ఆదుర్దా మొదలైంది మనసులో.



నడకవడి పెంచడంతో చిన్నగా ఆయాసం ప్రారంభమయింది. అయినా తప్పదు కదా! వేగంగానే సాగుతున్నాం.

అప్పటికప్పుడు నిర్ణయించాం ప్రయాణాన్ని. వాయిదా వేద్దామంటే వీలుకానిది. విజయవాడ నుంచి మళ్ళీ ఎప్పుడొస్తారో కృష్ణమూర్తిగారు. పిల్ల పుట్టిన రోజంటే తప్పనిసరిగా వచ్చారు తీరిక చేసుకొని. మా పెద్దమ్మాయి రాజీ అంటే ఆయనకెంతో అభిమానం. అప్పట్లో మేం వాళ్ళ పెద్దనాయన గారింట్లో అద్దెకుండేవాళ్ళం. అక్కడుండగానే పుట్టారు మా పెద్దమ్మాయి, రెండోదీను. పెద్దనాన్నగారి క్షేమ సమాచారాలు కనుక్కునేందుకు రోజూ వచ్చి పోతూండేవారు. అలా అయిన పరిచయం మా మధ్యన మంచి స్నేహంగా మారింది. ఇద్దరినీ ఏకసూత్రం చేసింది మా యిద్దరిలోనూ అమితంగా ఉన్న సాహితీ కండూతి. అసలే ఆయన తెలుగు ఉపాధ్యాయులు. ఇక మా సాహితీ చర్చలకు అడ్డూ... అదుపూ ఏముంది? ప్రాచీనమా... నవీనమా అని కాదు. ప్రతిరోజూ ఏదో ఒక గ్రంథం గురించో... కవి గురించో చిన్నపాటి చర్చ జరుగుతూ ఉండేది మా యిద్దరి మధ్య. మూడున్నర సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా సాహితీ చర్చలు జరిగాయి మా మధ్య. అప్పటికింకా పెళ్ళికాని మా కృష్ణమూర్తిగార్కి ముద్దులు మూట గట్టే మా పెద్దమ్మాయి బాగా మాలిమి అయింది. "మామా..." అంటూ ఆయన్ను వదిలేది కాదు ఉన్నంతసేపూ. అదిగో ఆ అనుబంధమే ఆయన్ను ఈ రోజు మా ఊరు వచ్చేలా చేసింది. ఉద్యోగరీత్యా నేను విజయవాడ నుంచి వచ్చేయడం వల్ల మా మధ్యన దూరం ఏర్పడినా మానసికంగా మమ్మల్ని వేరు చెయ్యడం సాధ్యపడలేదు కాలానికి. ఎవరో రచయిత అన్నట్టు "దూరాలను కలిపే దారాలు



ఉత్తరాలే" గదా! అవే మా మనసుల్ని మరీ దగ్గరగా కలిపి కట్టేసాయి.

మాటల మధ్యలో "పంచారామాల్లో ఒకటైన అమరావతి చూడ్డం జరిగింది కానీ మిగిలిన క్షేత్రాలు దర్శించడం అవలేదండీ" అన్నారు కృష్ణమూర్తిగారు.

"అరె... ఆ ఆరామాలకు అతి చేరువలోకి వచ్చారు. ఎటుచూసినా రెండు మూడు గంటల ప్రయాణం ఒకదానికొకటి. మీరు 'ఊ' అనండి రేపు ఉదయమే బయలుదేరి సాయంత్రానికల్లా క్షేత్రదర్శనం చేసుకొని తిరిగిరావచ్చు" అన్నాను నేను.

"మీరంతగా చెప్తే నేను ఒక్కసారేం... ఎన్నిసార్లయినా ఊఁ అంటాను" అన్నారు కృష్ణమూర్తిగారు ఉత్సాహం ఉరకలు వేస్తుండగా. అలా నిర్ణయం అయిన ప్రయాణం యిది. ముందుగా భీమారామం, క్షీరారామంలను దర్శించి మధ్యాహ్నానికల్లా దక్షవాటిక ప్రవేశించి భీమేశ్వర దర్శనం కావించుకొని కొమరారామానికి సాయంత్రానికల్లా చేరుకోగల్గితే ఇంటికి ఏ రాత్రికి వచ్చినా పరవాలేదన్నట్టుగా ప్రణాళికను రచించాను.

## సూరిపండు

ఆదిలోనే హంసపాదన్నట్టు ఈ ఆలస్యం.

నేను భయపడుతున్నట్టుగానే రైలు కూత వేయడం, గేటు వేయడం రెండూ జరిగాయి. మరొక్క రెండు ఫర్లాంగుల దూరముంటుం దేమో. పరుగులాంటి నడకతో మేము హైరానా పడుతూ ముందుకు వెళ్తున్నాం.

సరిగ్గా స్టేషన్ రోడ్డులోకి తిరిగేసరికి "బాబూ రిచ్చా రమ్మంటారా" అన్నమాటలు మాకు అమృతపుజల్లుల్లా విన్పించాయి. "రైలు వచ్చేస్తోంది. మరెట్లా అందిస్తావో..." అంటున్న నా మాటలకు అడ్డొస్తూ "మీకెందుకు బాబ య్యా... మీరెక్కి కూకోండి. బండి కందించే పూచీ నాది" అంటూ రిక్షాని రోడ్డు పైకి తీసి నిలబెట్టాడు. ఇద్దరమూ అందులో పడ్డాము. శ్రమ తగ్గడంతో అలుపు తగ్గింది. ఊపిరి ప్రశాంతంగా తీసుకుంటున్నాము. రైలు అందుతుందో... లేదో... అన్న ఆందోళన మాత్రం తగ్గలేదు. "ఏంటోయ్... మరీ గూడ్సు బండిలా నడుపుతున్నావ్... ఇలాగయితే బండి అందినట్లే..." తొందర చేసాను నేను.

హడావిడిలో బాడుగ ఎంతో మాట్లాడలేదు. దిగిన తర్వాత పేచీ పెట్టడు గదా... అనుకున్నా ను. 'ఆఁ' మామూలుగా అయితే ఓ రెండు రూపాయలు చాలు. త్వరపెడ్తున్నాం కాబట్టి మరో రూపాయి అదనంగా యిస్తే వాడూ ఆనం దిస్తాడు. అనుకున్నాను.

స్టేషన్ లోపల రైలుబండి, స్టేషన్ ముందు మా రిక్షా బండీ ఒకేసారి ఆగాయి. రిక్షాలోంచి చెంగున దూకి "నేను టికెట్స్ తీసుకుంటాను. మీరు కిరాయిచ్చిరండి" అంటూ స్టేషన్ లోప లికి పరుగెత్తారు కృష్ణమూర్తిగారు. జేబులో చూసాను. చిల్లర లేదు. పది కాగితం చేతికి తగిలింది. అదే వాడికివ్వబోయాను. "అయ్యా... బోణీ బేరం తమరిదే. సిల్లరిప్పించండి బాబా" అంటూ నోటు తీసుకొనే ప్రయత్నం చెయ్యలేదు వాడు.

జేబులన్నీ వెదికాను. పదికి తక్కువ నోటు కనపడలేదు. "సరే... రా... ఆయన దగ్గరున్న దేమో. తీసుకొని యిస్తాను" అంటూ స్టేషన్‌లోకి పరుగెట్టాను. నా వెనుకనే రిక్షా ఆసామీ వచ్చాడు.

అప్పటికే బండి ఎక్కి "రండి మాష్టారూ... బండి కదుల్తోంది" అంటున్నారు కృష్ణమూర్తి గారు.

"ఓ రెండున్నరో... మూడో చిల్లరివ్వండి" అన్నాను కదుల్తున్న బండితో పాటు పరుగెడు తూ. ఆయన జేబులు తడిమి లేదండీ... అన్నా రు. ఓ ప్రక్క బండి వేగం పెరుగుతోంది. "సా ర్... డబ్బులు" అంటూ రిక్షావాడు.

పరుగెత్తే రైల్లోకి గెంతాను నేను. చేతిలో పది రూపాయల నోటు గార్డు చేతిలో పచ్చ జెండాలా గాలికి రెపరెపలాడుతోంది.

"అయ్యగారూ... నా కిరాయి..." అంటూ ఆయాసపడుతూ రైలు వెంటే పరుగెడుతున్నాడు వాడు. ఆ కాగితం వాడి చేతిలో పెట్టే ఔదార్యం నాలో కలగలేదు. వేగం పెంచుకుంటూ రైలు మామధ్య దూరాన్ని పెంచుతోంది. రొప్పుతూ పరుగెత్తలేక నిలబడిపోయాడు వాడు.

దీనంగా నా వంక చూస్తూ "గొప్పోరు బాబూ... తమరు..." అంటున్న వాడి మాటలు వాడి శూలాల్లా నా కర్ణపుటాలను సోకాయి. క్షేత్రదర్శనం అంతా అనుకున్నట్టుగానే జరి గింది.

ఏ క్షేత్రంలో చూసినా నాకు శివుడు కాదు కనపడింది. పానవట్టం మీద నిలబడి "గొప్పో రు బాబూ... తమరు" అంటున్న రిక్షావాడే.